క్లుప్తంగా

పటేల్ రమేష్‌రెడ్డికి సన్మానం

అర్వపల్లి : రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమితులైన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డిని తిమ్మాపురం పీఏసీఎస్ మాజీ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు ఇందుర్తి వెంకట్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో సన్మానించారు. ఈ ప్రాంతంలో పర్యాటక అభివృద్ధికి కృషిచేయాలని కోరినట్లు చెప్పారు.

మినీ అండర్‌పాస్‌లో స్టాపర్స్ ఏర్పాటు



ట్రాఫిక్‌ను అదుపు చేస్తున్న ఎస్‌ఐ సాయిరాం

సూర్యాపేట క్రైం : జిల్లా కేంద్రంలోని 65వ జాతీయ రహదారిపై మినీ అండర్‌పాస్ వద్ద ట్రాఫిక్ సమస్యకు ట్రాఫిక్ ఎస్‌ఐ సాయిరాం మంగళవారం ప్రత్యేక చర్యలు చేపట్టారు. మినీ అండర్‌పాస్ నుంచి ద్విచక్ర వాహనాలు మాత్రమే వెళ్లేలా స్టాపర్స్‌ను ఏర్పాటు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని నెల్లిబండ తండా ఫీడర్ పరిధిలో బుధవారం చెట్ల తొలగింపు పనులు చేపడుతున్నందున సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వేణుగోపాల్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

చివ్వెంల : విద్యుత్ లైన్‌లో మరమ్మతులు చేపడుతున్నందున బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని కుడకుడ, స్నేహనగర్‌లో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

21న వాహనాల వేలం

సూర్యాపేట క్రైం : ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన 14 టూ వీలర్, 3 ఆటోలు, 1 ఫోర్ వీలర్‌కు ఈ నెల 21న ఎక్సైజ్ అధికారి ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ మల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు వేలంపాటలో పాల్గొనాలని ఆయన కోరారు.

పోలీసుల కవాతు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

పెన్‌పహాడ్ : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా నాగులపాటి అన్నారం, అన్నారం బ్రిడ్జి గ్రామాల్లో మంగళవారం సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీస్ సిబ్బంది కవాతు నిర్వహించినట్లు ఎస్‌ఐ రవీందర్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చివ్వెంల ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎస్‌ఐకి సన్మానం

అర్వపల్లి : అర్వపల్లి ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌కె.యాకూబ్‌ను బీఆర్‌ఎస్ సోషల్ మీడియా బాధ్యుడు, గిరిజన యూత్‌సంఘం నాయకుడు అంగోత్ అనిల్‌నాయక్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో అంగోత్ విజయ్‌నాయక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి అభిమాని పాదయాత్ర

నాగారం : వర్ధమానుకోట గ్రామానికి చెందిన దుర్గం సతీష్‌చారి హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసేందుకు మంగళవారం పాదయాత్రగా వెళ్లాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని, రేవంత్‌రెడ్డి సీఎం కావాలని యాదగిరిగుట్ట మెట్లను మోకాళ్లపై ఎక్కినట్లు తెలిపారు. గాంధీ భవన్ నుంచి కొండగట్టు వరకు పాదయాత్ర చేసినట్లు పేర్కొన్నారు. మొక్కులు తీరడంతో ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఉప్పల్ పెద్దమైసమ్మ గుడి నుంచి సీఎం నివాసానికి పాదయాత్రగా బయలుదేరినట్లు చెప్పారు.

పశువులకు టీకాలు

తుంగతుర్తి : రైతులు పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ ఏ.సరేష్ అన్నారు. మంగళవారం సంగెం గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ ఎస్.రవి, గోపాలమిత్ర శ్రీనివాస్‌రెడ్డి, పశుమిత్రలు పాల్గొన్నారు.

‘భగీరథ’ నీళ్లు బందైతే కష్టాలే..

- పాలేరు రిజర్వాయర్ ఎండిపోవడంతో నీళ్లు రావంటున్న అధికారులు
- జాజిరెడ్డిగూడెం మండలానికి మిషన్ భగీరథ నీళ్లే ఆధారం
- ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటామంటున్న అధికారులు

అర్వపల్లి : పాలేరు రిజర్వాయర్ ఎండిపోవడంతో మిషన్ భగీరథ నీళ్ల రావడం కష్టమని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. మళ్లీ వర్షాలు పడి రిజర్వాయర్ నిండేవరకు ప్రత్యామ్నాయం చూసుకోవాలని స్పష్టం చేస్తున్నారు. రెండు రోజుల కిందట జరిగిన జాజిరెడ్డిగూడెం మండల సర్వసభ్య సమావేశంలో మిషన్ భగీరథ అధికారులు ఈ విషయాన్ని తెలియజేశారు. పాలేరు రిజర్వాయర్ పూర్తిగా ఎండిపోయినందున కేవలం వారం రోజులు మాత్రమే మిషన్ భగీరథ నీళ్లు వస్తాయని ఆ తర్వాత భగీరథ నీళ్లు నిలిచిపోతాయని స్పష్టం చేశారు. దీంతో మండల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జాజిరెడ్డిగూడెం మండలానికి ప్రస్తుతం మిషన్ భగీరథ నీళ్లే ఆధారం. అన్ని గ్రామాలు ఈ నీటిపైనే ఆధారపడుతున్నాయి. కాగా మండలంలోని 17గ్రామపంచాయతీల్లో రక్షిత మంచినీటి పథకాలు ఉన్నప్పటికీ మిషన్‌భగీరథ నీళ్లు ప్రారంభమైనప్పటినుంచి ఈ పథకాలు సరిగా పనిచేయడం లేదు. మండల వ్యాప్తంగా 37 మిషన్‌భగీరథ ఓవర్ హెడ్ ట్యాంక్‌లు ఉన్నాయి. ప్రతిరోజు ఈ ట్యాంక్‌లను మిషన్ భగీరథ నీటితో నింపి ప్రజలకు సరఫరా చేస్తున్నారు. మండల వ్యాప్తంగా మిషన్ భగీరథ కింద 6వేల నల్లా కనెక్షన్లు ఉన్నాయి. అలాగే భగీరథ ద్వారా ఇంటింటికీ నీరందించుటకు



అర్వపల్లిలోని మిషన్ భగీరథ ట్యాంక్

మండలంలో 88 కి.మీ మేర 37 గ్రామాల్లో పైప్‌లైన్లు వేశారు. అలాగే మొత్తం 98రక్షిత మంచినీటి పథకం బోర్లు ఉన్నాయి.

ఎస్‌డీఎఫ్ కింద రూ.21.50లక్షలు మంజూరు..

ప్రస్తుత వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా ఎస్‌డీఎఫ్ 2023–24 నిధుల నుంచి మండలానికి రూ.21.50లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో గ్రామాలలో పనులు చేపట్టాల్సి ఉంది. ఆడివెంలకు రూ.3లక్షలు, బొల్లంపల్లికి రూ.1.50లక్షలు, అర్వపల్లికి రూ.5లక్షలు, కాసర్లపహాడ్‌కు రూ.4లక్షలు రామన్నగూడేనికి రూ.4లక్షలు, తిమ్మాపురం గ్రామానికి రూ.4లక్షల చొప్పున మంజూరయ్యాయి. మిషన్‌భగీరథ నీరు బంద్ కాకముందే ఎస్‌డీఎఫ్ ద్వారా మంజూరైన పనులను పూర్తి చేసి మండలంలో నీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులను కోరుతున్నారు.

నీటి సమస్య తలెత్తకుండా చూడాలి



పాలేరు రిజర్వాయర్‌లో నీళ్లు ఎండిపోయినందున మిషన్ భగీరథ నీరు రాదని అధికారులు చెబుతున్నారు. అందుచేత వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి. ఎస్‌డీఎఫ్ ద్వారా మంజూరైన నిధులతో వెంటనే పనులు చేపట్టాలి. ఇప్పటికే గోదావరి జలాలు సరిగా రాక సాగునీటికి ఇబ్బంది ఏర్పడుతోంది. దీనికి తోడు తాగునీటి సమస్య తలెత్తితే మరిన్ని ఇబ్బందులు ఏర్పడనున్నాయి.

– వజ్జె శ్రీనివాస్, సీపీఎం మండల కార్యదర్శి

ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నాం



పాలేరు రిజర్వాయర్‌లో నీళ్లు ఎండిపోయాయి. దీంతో మిషన్ భగీరథ నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. ఎస్‌డీఎఫ్ ద్వారా రూ.21.50లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో నీటి సమస్య పరిష్కరించనున్నాం. అలాగే రక్షిత మంచినీటి పథకాల బోర్లు, చేతి పంపులు పనిచేసేలా చూస్తున్నాం.

– మహేష్, మిషన్ భగీరథ ఏఈ

అవినీతికి పాల్పడినందుకే అవిశ్వాసం

- తిరుమలగిరి మున్సిపల్ కౌన్సిలర్లు



సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

తిరుమలగిరి : మున్సిపల్ చైర్‌పర్సన్ అవినీతి, అక్రమాలకు పాల్పడినందుకే అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశ పెట్టామని మున్సిపల్ కౌన్సిలర్లు శాగంటి అనసూయ, పొన్న రాజ్యలక్ష్మి, పత్తెపురం సరిత, కుదురుపాక శ్రీలత, కన్నెబోయిన రేణుక, గిలకత్తుల ప్రియలత తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పోతరాజు రజని ఎంపికైనప్పటి నుంచి ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడంతో తామంతా విసిగి పోయామని అన్నారు. ఎవ్వరిని సంప్రదించకుండా, ఎలాంటి తీర్మానాలు చేయకుండా అధికారులతో కుమ్మక్కయ్యారని ఆరోపించారు. ఎన్నికైనప్పటి నుంచి స్థానికంగా అందుబాటులో ఉండటం లేదని తెలిపారు. మున్సిపాలిటీ కార్యాలయంలో అక్రమంగా ఉద్యోగాలు నియమించారని అన్నారు. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడంలో స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ ప్రమేయం ఏమాత్రం లేదని తెలిపారు. దళిత బంధులో లక్షలాది రూపాయలు వసూలు చేశారని ఆరోపించారు. సంవత్సరంలో 2, 3సార్లు మాత్రమే మున్సిపల్ సమావేశం నిర్వహించారని తెలిపారు. ఏనాడు కూడా సాటి మహిళా కౌన్సిలర్ అనే గౌరవం ఇవ్వలేదని, నియంతృత్వంగా వ్యవహరించారని ఆరోపించారు.

గ్రీన్ క్లబ్ ట్రస్ట్ సేవలు అభినందనీయం



మహదేవ్‌కు జ్ఞాపికను అందిస్తున్న ట్రస్టు సభ్యులు

భానుపురి : గ్రీన్ క్లబ్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని సుధాకర్ పీవీసీ మెనేజింగ్ డైరెక్టర్ మీలా మహదేవ్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా గ్రీన్ క్లబ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సుధాకర్ పీవీసీ వారి సహకారంతో మన పర్యావరణం – మన బాధ్యత అనే అంశంపై రాష్ట్ర స్థాయిలో వివిధ పాఠశాలల్లో ఫిబ్రవరి 8 నుంచి వ్యాస రచన పోటీలు నిర్వహించారు. దాదాపు 15 వేల మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. వారిలో గెలుపొందిన 500 మంది విద్యార్థులకు సుమారుగా ఒక లక్ష రూపాయల విలువైన బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. అనంతరం ట్రస్టు సభ్యులు మీలా మహదేవ్‌కు జ్ఞాపికను అందించారు. ఆర్థిక సాయం అందించిన సుధాకర్ పీవీసీ మేనేజింగ్ డైరెక్టర్ మీలా మహదేవ్‌కు ట్రస్టు అధ్యక్షుడు ముప్పారపు నరేందర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి డాక్టర్ తోట కిరణ్, కోశాధికారి ఉప్పల శ్రావణ్, ఈసీ మెంబర్లు ముప్పారపు నాగేశ్వరరావు, వనమాల వెంకటేశ్వర్లు, గెల్లి అంజన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఫణిగిరిలో బ్రహ్మోత్సవాలు



ఫణిగిరిలో బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన సీతారామచంద్రస్వామి ఆలయం

నాగారం : నాగారం మండల పరిధిలోని ఫణిగిరిలో బుధవారం నుంచి ఈ నెల 31 వరకు సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గట్టు లక్ష్మీకాంత్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారు సపరివారసమేతంగా గుట్టపైకి చేరడం, తొళక్కంతో ప్రారంభమవుతుందని, ఈ నెల 24న స్వామివారి కల్యాణమహోత్సవం ఉంటుందని తెలిపారు. 26న రథోత్సవం, 28న చక్రస్నానం, 23న బండ్ల ఊరేగింపు కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. స్వామివారి కల్యాణ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ కార్యనిర్వహణ అధికారి వై.శ్రీనివాస్‌రెడ్డి, అర్చకులు కె.సంతోష్ కుమార్ ఆచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి



ఆత్మకూరులో ఎండిపోయిన వరిపొలంలో నిరసన తెలుపుతున్న ఏఐకేఎంఎస్ నాయకులు

ఆత్మకూర్(ఎస్) : వేలకు వేలు ఖర్చుపెట్టి సాగుచేసిన వరి పొలాలు చేతికందే దశలో ఎండిపోతున్నాయని, నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ.25 వేల నష్టపరిహారం అందించాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఖాసీంగూడెం, ఆత్మకూరు గ్రామాల్లో ఎండిన వరిపొలాలను పరిశీలించారు. అనంతరం వారు నిరసన తెలిపి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని అన్నారు. రుణమాఫీ చేయకపోవడంతో రైతులు కొత్త రుణాలు తీసుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎస్సారెస్పీ నీళ్లు అందకపోవడంతో ఎకరాల కొద్ది వరి పంటలు ఎండిపోతున్నాయని అన్నారు. యాసంగి నుంచి వరికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంటా నాగయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు ఎస్‌కే మైబెల్లి, పోరెడ్ల దశరథ, సామ నర్సిరెడ్డి, డేగల వెంకటక్రిష్ణ, ఎర్ర ఉమేష్, సంజీవరెడ్డి, తాళ్లపల్లి లింగయ్య, ఉప్పుల పిచ్చయ్య పాల్గొన్నారు.

మొదటి రోజు నామినేషన్లు నిల్

చివ్వెంల : ఈ నెల 28న జరగనున్న సూర్యాపేట బార్ అసోషియేషన్ ఎన్నికలకు సంబంధించి మంగళవారం మొదటి రోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. బుధవారం ఒక్క రోజే గడువు ఉండటంతో పోటీలో పాల్గొనే వారు భారీ సంఖ్యలో నామినేషన్లు వేసే అవకాశం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అధ్యక్ష స్థానానికి ముగ్గురు సీనియర్లు పోటీ పడుతుండగా, ఉపాధ్యక్ష స్థానానికి ఇద్దరు, ప్రధాన కార్యదర్శికి ఇద్దరు నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉంది. ఎగ్జిక్యూటివ్ మెంబర్ పోటీలో పాల్గొనేందుకు ఈసారి పలువురు జూనియర్ న్యాయవాదులు ఆసక్తి చూపుతున్నారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు ఆసక్తి గల న్యాయవాదులు ఆయా పదవులకు నామినేషన్లు దాఖలు చేసుకోవాలని ఎలక్షన్ అధికారి గూడూరు శ్రీనివాస్ తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయంలో రికార్డుల పరిశీలన



తిరుమలగిరిలోని తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ వేణుమాధవరావు

తిరుమలగిరి : తిరుమలగిరి తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవరావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి మాట్లాడారు. విధుల్లో సమయపాలన పాటించాలని కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం తిరుమలగిరి మున్సిపాలిటీలో చైర్మన్, వైస్ చైర్మన్ అవిశ్వాస తీర్మానం సందర్భంగా 144 సెక్షన్ విధించినట్లు తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ జాన్ మహ్మద్, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు



నగదును స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

మద్దిరాల : ఎవరైనా ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ మధునాయుడు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కుంటపల్లి చెక్ పోస్టు వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బొజ్జ సుభాష్ అనే వ్యక్తి వద్ద రూ.56,430లు, ఉప్పుల లింగయ్య అనే వ్యక్తి వద్ద రూ.1,93,000లను పట్టుకొని స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. వాటికి తగిన ధ్రువపత్రాలు చూపించినట్లయితే వారికి ఆ నగదును తిరిగి అందజేస్తామని అన్నారు. అంతకు ముందు మండల కేంద్రంలోని బెల్ట్ షాపుల తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన తుమ్మ శ్రీనివాస్ వద్ద 6లీటర్ల (లిక్కర్‌ను) మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

మద్దిరాల : మండల కేంద్రంలో సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలని బీజేపీ జిల్లా సహాయ కార్యదర్శి వడ్లాణం యతిరాజరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సీసీ రోడ్ల పనుల్లో నాణ్యత ప్రమాణాలు దెబ్బతింటున్నాయని అన్నారు. ఈ సమావేశంలో వడ్డె వీరయ్య, ముత్తినేని రమేష్, వల్లపు లింగయ్య, బొలగాని యాకస్వామి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి నివాళి

నూతనకల్ : లింగంపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మార్గం రామచంద్రయ్య మృతి పార్టీకి తీరని లోటని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి, తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం రామచంద్రయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో కట్టా మల్లారెడ్డి, దరిపెల్లి వీరన్న, మడ్డి లింగయ్య, ఉప్పుల పాపయ్య, మోహన్‌రావు ఉన్నారు.

మల్లు స్వరాజ్యంకు నివాళి



అర్వపల్లిలో స్వరాజ్యం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



నాగారం : డి.కొత్తపల్లిలో..



తుంగతుర్తిలో..



నూతనకల్‌లో స్వరాజ్యం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

అర్వపల్లి : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు కోరారు. అర్వపల్లిలో మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో స్వరాజ్యం ద్వితీయ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్, ఈదురు వీరపాపయ్య, ఎస్.అబ్బులు, కె.విజయ్‌కుమార్, దేవరకొండ వెంకన్న, యాదగిరి, కృష్ణయ్య, సైదయ్య, కొప్పోజు యాదగిరి, బాలయ్య, పగిడిమర్రి శేఖర్, శ్రీనివాస్, వెంకన్న, రవి, వెంకులు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

పోరాట స్ఫూర్తితో ముందుకెళ్లాలి..

తుంగతుర్తి : సాయుధ రైతాంగ పోరాటంలో మల్లు స్వరాజ్యం చూపిన పోరాట స్ఫూర్తితో నేటి యువత ముందుకెళ్లాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరి రావు అన్నారు. మల్లు స్వరాజ్యం వర్ధంతి సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని పద్మశాలి భవనంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బుర్ర శ్రీనివాస్, మండల కమిటీ సభ్యులు ముత్తయ్య, విష్ణుమూర్తి, సోమయ్య, యాదగిరి పాల్గొన్నారు.

నాగారం : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, తుంగతుర్తి మాజీ శాసన సభ్యురాలు, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు మల్లు స్వరాజ్యం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి దేవరకొండ యాదగిరి అన్నారు. మంగళవారం మల్లు స్వరాజ్యం ద్వితీయ వర్ధంతి సందర్భంగా డి.కొత్తపల్లి గ్రామంలో ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మహిళలు వెంకటమ్మ, సృజన, మాణిక్యమ్మ, సుజాత, ప్రమీల, కవిత తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, మాజీ ఎమ్మెల్యే మల్లు స్వరాజ్యం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కందాల శంకర్‌రెడ్డి కోరారు. మంగళవారం మల్లు స్వరాజ్యం వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని తొట్ల మల్సూర్ స్మారక భవనంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కూసు సైదులు, శ్రీనివాస్‌రెడ్డి, తొట్ల లింగయ్య, బాలకృష్ణ, సామ వెంకట్‌రెడ్డి, మున్నా నాగమల్లు, శివారెడ్డి, జక్కుల రామచంద్రు పాల్గొన్నారు.

భగత్ సింగ్ స్ఫూర్తితో పోరాడాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పీవైఎల్ నాయకులు

నాగారం : భగత్ సింగ్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్ అన్నారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 93వ వర్ధంతి వారోత్సవాల్లో భాగంగా మంగళవారం డి.కొత్తపల్లి గ్రామంలో పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 15 నుంచి 30 వరకు భగత్‌సింగ్, రాజుగురు, సుఖదేవ్‌ల వర్ధంతి వారోత్సవాలను పీడీఎస్‌యూ–పీవైఎల్ ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా నాయకులు వేముల గణేష్, పల్లర్ల సోమన్న, నాతి బాలరాజు, మర్రిపల్లి సతీష్, వంగూరి చంద్రం, సైదులు, సోమయ్య, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అశోకనంద భారతి స్వామికి డాక్టరేట్



డాక్టరేట్ స్వీకరిస్తున్న అశోకనంద భారతి స్వామి

తిరుమలగిరి : తిరుమలగిరి మండల కేంద్రానికి చెందిన అశోకనంద భారతి స్వామికి జ్యోతిష్య శాస్త్రంలో సేవలకు గాను వెబిట్ యూనివర్సిటీ వారు బుధవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. అశోకనంద భారతి స్వామి ప్రస్తుతం శ్రీశైలం ఆలయంలో పీఠాధిపతిగా వ్యవహరిస్తున్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం



తిరుమలగిరి : గుండెపురిలో చెక్కును అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు



నూతనకల్ : మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

తిరుమలగిరి : తిరుమలగిరి మండలం గుండెపురి గ్రామానికి చెందిన పాలకుర్తి వెంకన్న ఇటీవల తాటి చెట్టు ఎక్కుతుండగా గుండెపోటుకు గురై మృతి చెందాడు. దీంతో వెంకన్న కుటుంబానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రూ.లక్ష ఆర్థికసాయం పంపించారు. ఆ నగదును మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాలకుర్తి రాజయ్య, తీగల శ్రీధర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ జమ్మిలాల్, పేరాల వీరేష్, బాలకృష్ణ, శ్రీనివాస్ యాదవ్, రమేష్, మహేష్, పరశురామ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : మండల పరిధిలోని ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన శ్రీరాముల ఉప్పలయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఈ విషయం తెలుసుకున్న మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1991–92 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు మంగళవారం మృతుడి భార్యకు రూ. 13వేల ఆర్థికసాయం అందజేశారు. అనంతరం ఉప్పలయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఇరుగు బుచ్చిమల్లు, నెల్లుట్ల కృష్ణయ్య, కోడి రవి, డీకొండ వెంకటేశ్వర్లు, ఎనిగతల కృష్ణయ్య, మొగుళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

నూతనకల్ : ఆరోగ్య మహిళా కార్యక్రమం ద్వారా అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి కీసర అక్షితారెడ్డి కోరారు. మంగళవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి గురువారం మహిళా ఆరోగ్య కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. మహిళలు వారానికి రెండు సార్లు నిర్వహించే ఆరోగ్య కార్యక్రమానికి హాజరై అనారోగ్య సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

సంఘబంధం కమిటీల ఎన్నిక

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం గ్రామ సంఘబంధం –1, సంఘబంధం –2 నూతన కమిటీలను మంగళవారం ఎన్నుకున్నారు. సంఘబంధం–1 అధ్యక్షురాలిగా కర్కాని శైలజ, కార్యదర్శిగా నాగెల్లి ధనమ్మ, కోశాధికారిగా తోట హైమావతి, సంఘబంధం–2 అధ్యక్షురాలిగా బొడ్డు స్వప్న, కార్యదర్శిగా నోముల అనిత, కోశాధికారిగా పాలెల్లి ఉమలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘబంధాల మహిళలు నూతన కార్యవర్గాలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వీఓఏలు దేవరకొండ విజయ, చంద్రకళ, మహిళలు పాల్గొన్నారు.



నూతన అధ్యక్షులను సన్మానిస్తున్న సభ్యులు

భూసదస్సు కరపత్రం ఆవిష్కరణ

నడిగూడెం : సాగు భూముల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో ఈ నెల 23న నిర్వహించబోయే భూసదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర అధ్యక్షుడు జక్కుల వెంకటయ్య పిలుపునిచ్చారు. మంగళవారం నడిగూడెం మండలంలోని రామాపురంలో సదస్సు కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రామాపురం రెవెన్యూ పరిధిలోని 190 సర్వే నంబర్‌లో దాదాపు 2200 ఎకరాల భూములున్నాయని, ఆ భూములలో ఉన్న రైతులందరికీ పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మాధవరెడ్డి, రామకృష్ణ, వీరస్వామి, వీరయ్య, కోటయ్య, గుర్వయ్య, సంధ్య పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తిరుమలగిరి : మండలంలో అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సత్యనారాయణ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.